# 16899 దిగువన మరింత బలహీనం




**సమీక్ష:** ఐరోపా సంక్షోభ పరిణామాలకు తోడు దేశీయంగా బలహీన ఆర్థిక గణాంకాలు, ఆర్థిక ఫలితాల గణాంకాలు కలిసి బీఎస్ఈ సెన్సెక్స్‌ను నష్టాల్లోకి తీసుకువెళ్లాయి. తొలుత మన మార్కెట్లు సానుకూలంగా ప్రారంభమైంది. అయితే ఇటలీ బాండ్ల వ్యవహారం అంతర్జాతీయ మార్కెట్లలో ఆందోళనలను రేకెత్తించడంతో భారీ లాభాల స్వీకరణ జరిగింది. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ భారత బ్యాంకింగ్ వ్యవస్థ రేటింగ్ తగ్గించడం కూడా ఇందుకు కారణమైంది. అటుపైన వెలువడ్డ బలహీన పారిశ్రామికోత్పత్తి గణాంకాలూ స్థానిక స్టాక్ మార్కెట్లను నీరుగార్చాయి. ఆహార ద్రవ్యోల్బణం కాస్త తగ్గడం; షార్ట్ కవరింగ్ తదితర సానుకూల పరిణామాలతో కొంత కోలుకున్నా, చివరకు 370 పాయింట్ల నష్టంతో 17193 వద్ద స్థిరపడింది.

**ఎఫ్ఐఐల తీరు:** గత వారం ట్రేడింగ్ జరిగిన 3 రోజుల్లో విదేశీ సంస్థాగత మదుపుదార్లు (ఎఫ్ఐఐలు) రూ.1,141 కోట్ల నికర కొనుగోళ్లు చేయగా.. ఫండ్లు రూ.24 కోట్ల నికర విక్రయాలు చేశాయి.

**రంగాల వారీగా:** బలహీన మార్కెట్లకు తోడు నిరుత్సాహకర ఫలితాల నేపథ్యంలో స్థిరాస్తి షేర్లు డీలా పడ్డాయి. ఎస్‌బీఐ ఫలితాలు బ్యాంకుల నిరర్థక ఆస్తులపై సందేహాలను లేవనెత్తడంతో బ్యాంకింగ్ సూచీ కూడా కుంగింది. హిండాల్కో, టాటా స్టీల్ ఆర్థిక ఫలితాలు రాణించకపోవడంతో లోహ సూచీ విక్రయాలను ఎదుర్కోవలసి వచ్చింది. వస్తు రంగ (ఎఫ్ఎమ్‌సీజీ) షేర్లలో కొనుగోళ్లు కనిపించగా.. రూపాయి విలువ తగ్గడంతో ఐటీ సూచీ కొంత కుదుటపడింది.

శుక్రవారానికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:2గా నమోదవడం.. మార్కెట్ మొత్తం మీద విక్రయాల ఒత్తిడిని సూచిస్తోంది.

**ఈ వారంపై అంచనాలు:** సెన్సెక్స్‌కు 18000 స్థాయి కీలక నిరోధ స్థాయిగా కొనసాగింది. 17200- 17300 మద్దతు స్థాయిల దిగువన మార్కెట్ ముగియడం చూస్తే స్వల్పకాలంలో బలహీనతలు కొనసాగుతాయనిపిస్తోంది. ఒక వేళ మార్కెట్ 16899 స్థాయి కన్నా కింద స్థిరపడితే మరింత నష్టాన్ని అంచనా వేయొచ్చు.

**ప్రభావం చూపే అంశాలు:** ఐరోపా మార్కెట్ల ఊగిసలాటలు మన మార్కెట్లపై ప్రభావాన్ని కొనసాగించవచ్చు. శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్లు సానుకూలంగా ముగియడం చూస్తే నేడు మార్కెట్లు లాభాలతో ప్రారంభం కావొచ్చు. మరో పక్క నేడు విడుదల కానున్న డబ్ల్యూపీఐ ఆధారిత ద్రవ్యోల్బణం గణాంకాలు తగ్గితే కనుక వడ్డీ రేట్లతో ప్రభావితం అయ్యే సూచీలు కొంత మెరుగుపడవచ్చు. ఒక వేళ పెరిగితే మార్కెట్లు మరింత దిగజారొచ్చు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన రంగాలలో కదలికలు కనిపించవచ్చు. గత వారం కొంత మేర పెరిగిన ముడి చమురు ధరలు ఇంకా పెరిగితే మార్కెట్ లాభాలు పరిమితంగా ఉండవచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 17455, 17702, 18800;

**తక్షణ మద్దతు స్థాయిలు:** 17000, 16899, 16549.

**16899 దిగువన మార్కెట్ స్థిరపడితే కనుక మరింత బలహీనతలు కనిపించవచ్చు.**

– సతీశ్ కంతేటి, జెన్‌మనీ